# మధురస్వప్న గుళికలు

ప్రొఫెసర్ రామేశం తనలో తాను ఆలోచించుకుంటూ హరవిలాస్ కాఫీ హోటల్లో ప్రవేశించాడు. అల్పాహారం పుచ్చుకుని తనదారిన తను ప్రయోగశాలకు వెళ్ళి కూచుందామని సంకల్పం. నెత్తిమీద టోపీ యింటి దగ్గరే మర్చిపోయాడు. బట్టతల నిగనిగలాడుతూ కనిపిస్తోంది. రామేశానిది సాధారణంకంటే సైజులో పెద్దతల. లోపల మెదడు కూడా అలాగే పెద్దదయి వుంటుందని అతని ఉద్దేశ్యం. అవును మరి! ఎంత పెద్ద మెదడు కాకపోతే, యీ నడివయస్సులోనే యింత ఖ్యాతి సంపాదించ గలుగుతాడు?

ప్రొఫెసర్ అయిదు నిమిషాలు ప్రశాంతంగా వేచి కూర్చున్నాడు. వెయిటర్ రాలేదు. కొద్దిగా చికాకు అనిపించింది. బల్లమీద గ్లాసుతో టక టక చప్పుడు చేశాడు. పక్క బల్లముందు కూచున్న యిద్దరు ఆసామీలు ఉలిక్కిపడి వెయిటర్‌ను పిలిచారు, ఆఖరుకు ఒక వెయిటర్ వచ్చాడు. ప్రొఫెసర్ బల్లముందు సవినయంగా నిలబడి యేంకావాలని అడిగాడు.

'రెండు బిస్కట్లు-వేడి వేడి పాలు పట్టుకురా, చాలు' అని ప్రొఫెసర్ మళ్ళీ తన ఆలోచనలో మునిగిపోయాడు,

వెయిటర్ వెళ్ళిపోవడంతో యెవరో ఒక యువకుడు హోటల్లో ప్రవేశించి ప్రొఫెసర్ ముందు కుర్చీలో కూర్చున్నాడు. ఇద్దరూ యెదురెదు రుగా వున్నారు. కొత్తగా వచ్చిన మనిషి ప్రొఫెసర్ బట్టతలవంక నిశితంగా చూశాడు. మెదడును అంచనా వేసుకున్నట్టున్నాడు లోలోపల.

'క్షమించండి. మీతో నాకు పరిచయంలేదు. అయినా మీ మేధస్సు చాలా ఉన్నతస్థాయికి చెందినదని నా కనిపిస్తుంది' అన్నాడు యువకుడు ఉన్నట్టుండి.

వేడివేడి పాలు చప్పరిస్తున్నప్పుడల్లా గ్లాసు కిందపెట్టి, ప్రొఫెసర్ 'అవునవును, నేను కొత్తకొత్త పరిశోధనలు చేశాను. కాని యింతవరకూ దేనికి కూడా నిజంగా రావలసిన ప్రఖ్యాతి రానేలేదు. ఇప్పుడు మరో నూతన పరిశోధన నా మనస్సులో మెరుసులుతోంది. ఇది సవ్యంగా ముగిస్తే, మానవజాతి సుఖసంపదలతో ఓలలాడిపోతుంది. మధురాతి మధురమయిన భావాలలో తేలిపోతుంది, కాని-యేమవుతుందో-దీనికి కావలసినంత డబ్బునా దగ్గరలేదు. ఈ ప్రపంచంలో ప్రతిపనికి ముందుగా డబ్బేకావాలి. డబ్బులేని వాడు దుబ్బుకు కొరగాడు. నే నెంత పరిశోధన చేయగలవాడినయితే యేం లాభం? నా దగ్గర డబ్బులేదు. నా ఆలోచన నెరవేరే సదుపాయంలేదు.... నేనిలా కుంగిపోవలసిందే!' అన్నాడు.

'డబ్బుకోసం కుంగిపోవాలా? నా దగ్గర బోలెడంత డబ్బుంది. ఊరికే పడి మూలుగుతోంది. డబ్బుకోసం మీరేం బెంగ పెట్టుకోకండి. ఆ విషయం నాకు వదిలెయ్యండి. మరో గ్లాసు వేడిపాలు పుచ్చుకోండి బిల్లు నేను చెల్లిస్తాను' అన్నాడు యువకుడు.

'ఓహో! మీదగ్గర చాలా డబ్బుందన్నమాట!'

'అన్నమాటేమిటి, అక్షరాలా నిజం. ఈ డబ్బంతా కొత్తరకం మాత్రలు తయారుచేయగలవారుంటే, వారికి ధారాదత్తం చేసేస్తాను. కలలు తెప్పించే మాత్రలు తయారుచేయగలవారు దొరికితే, యెంత డబ్బయినా పెట్టుబడి పెడతాను.'

ప్రొఫెసర్ బట్టతలమీద అరచేత్తో రాసుకుంటూ 'ఓహో! ఆ మాత్రలు వేసుకుంటే యెవరికి కావలసిన కలలు వారికి వస్తుండాలని మీ ఉద్దేశమా?' అన్నాడు.

'అవునండీ! నా వుద్దేశము చెబుతా వినండి. మనం పూర్తిగా ఏడెనిమిది గంటలు సుఖంగా నిద్రపోతూ వుంటాంకదా నిద్రపోతున్న

టైమంతా మనం వృధాచేస్తూన్నట్లే లెక్క. ఇది మన కెందుకూ ఉపయోగించకుండా పోతోంది. అప్పుడప్పుడూ మనకు కలలు వస్తూవుంటాయి. కొన్ని మంచివి, కొన్ని భయంకరమయినవి. ఇవన్నీ మనకు మళ్ళీ మెలుకువ వచ్చేసరికి గుర్తు ఉండకుండా పోతాయి. ఇట్లా కాకుండా, యీ మాత్ర వేసుకున్నప్పుడు మనం కోరుకున్నటువంటి చక్కటికల వచ్చేట్లయితే నిద్ర పోతున్న యేడెనిమిది గంటలు మనం సుఖంగా సంతోషంగా గడిపివేయవచ్చు, మనస్సుకు ఉత్సాహంగా ఉల్లాసంగా వుంటుంది. ఇటువంటి మాత్రలు తయారుచేయగలవారు యెవరైనా దొరుకుతారా అని నేను దేశమంతా గాలిస్తున్నాను. ఇన్నాళ్ళకు నా సత్కర్మ ఫలించి మీరు అగుపించారు. మీకు ఈ విషయమంతా కొత్తగా వింతగా కనిపించవచ్చుగాని, మీరు తలుచుకుంటే యీ మాత్రలు తయారు చేయగలరు. మీరు అమిత మేధావంతులనే విషయం నేను మొదటి చూపులోనే గ్రహించాను' అన్నాడు యువకుడు ఉపన్యాస ధోరణిలో.

ప్రొఫెసర్ సంతోషంగా అతడితో కరచాలనం చేశాడు, 'మీ ఆలోచన చాలా అద్భుతంగా వుంది. నాకేం సందేహం లేదు. ఈ పని చేసి తీరగలను. అంతులేని ఖ్యాతీ, డబ్బూ ఆర్జిద్దాం యిద్దరం' అన్నాడు.

'సంతోషం, ఇదిగో పదివేల రూపాయలకు చెక్కు' అని జేబు తడుముకొని 'క్షమించండి! చెక్కుపుస్తకం తేలేదు. ఇంటిదగ్గర ఉండిపోయింది. సాయంత్రం మీరు శ్రమ అనుకోకుండా మా యింటికి రాగలిగితే డబ్బే యిచ్చేస్తాను. మీ పని వెంటనే ప్రారంభిద్దురుగాని' అన్నాడు యువకుడు.

'మీ ఔదార్యం ప్రశంసనీయం! డబ్బు తెచ్చుకున్నాక, నేరుగా నా పరిశోధన ప్రారంభం చేస్తాను. కొద్దిరోజుల్లోనే కలలు సృష్టించే మాత్రలు సృష్టిస్తాను.'

'అంతే! మాతలు తయారవడంతోటే భారీయెత్తున ప్రదర్శనలు, ప్రకటనలు చేయిద్దాం. ప్రపంచం మన ప్రకటన చూచి దద్దరిల్లిపోవాలి. పెద్ద బజార్లో దుకాణం తీసుకుందాం. అక్కడ మీరు హాయిగా కూర్చొని మాత్రలకోసం వచ్చేవాళ్ళతో వీటిని గురించి గొప్పగా ఉపన్యాసం చెబుతూ ఉండాలి. నాకు అప్పుడే ప్రకటనకు ఒక మంచి ముక్క తోచింది వినండి. 'మీ నిద్రలో చలనచిత్ర సందర్శనం' ఎలావుంది? భేషుగ్గా లేదూ?'

'అందంగా వుంది. యింతకంటే చక్కని మాట ఎవరూ కనిపెట్ట లేరు. మనం ప్రచారంలోకి తెచ్చే కలలు తెప్పించే నిద్రమాత్రలు చాలా అద్భుతంగా వుంటాయిలెండి. ఓహో! మనం ఎంత త్వరగా వాటిని తయారుచేస్తే అంత మంచి దనుకుంటాను—'

యువకుడు తన చిరునామా కార్డు రామేశానికి అందించాడు. ఇద్దరూ కరస్పర్శ చేసుకుని విడిపోయారు.

ప్రొఫెసర్ తన గదికి పరుగుతీశాడు. యువకుడు—అతని పేరు భోళాశంకరం—తన యింటికి వెళ్ళిపోయాడు.

ప్రొఫెసర్ రామేశం తన గదికి వెళ్ళి తాపీగా ఆలోచించుకో సాగాడు. ఆ యువకుడు పిచ్చివాడయినా కావాలి లేదా గొప్ప మేధావి అయినా కావాలి. ఈ రెండింటిలో యేది నిజమో నిర్ధారణ చేసుకోవడం కష్టం. ఇంతకూ సాయంత్రం అతను డబ్బు వప్పజెపితేతప్ప యేం అనుకునేందుకూ వీల్లేదు-అనుకున్నాడు.

ప్రొఫెసర్ వుండే గదీ, ప్రయోగశాల అన్నీ అదే. అప్పుడే ఒక ప్రయోగము ప్రారంభించేశాడు. ఘాటు వాసనలు గదినిండా అలుము కున్నాయి ఇంటి యజమానురాలు ముక్కుకు జేబురుమాలు అడ్డం పెట్టు కుని గదిలోకి రానేవచ్చింది. తక్షణం యిల్లు ఖాళీచేయమని హుకుం యిచ్చింది-ఎప్పటి మాదిరిగానే.

'మీరేం తొందరపడకండమ్మా. నా ప్రయోగాలు ఫలించే రోజు దగ్గరకు వస్తోంది. ఒక్క నెల రోజుల్లో నా పేరు ప్రతి యింటా, ప్రతి వ్యక్తి నోట ఆడుతూ వుంటుంది. అప్పుడు నా గదిలో డబ్బు తాండవిస్తూ వుంటుం' దన్నాడు ప్రొఫెసర్ రామేశం.

'ఈ మాటలు చిన్నప్పటినుంచీ వింటూనే వున్నాం. ఇది నా యిల్లు. నా యింట్లో యిట్లాంటి వికారపు వాసనలు వస్తూవుంటే నేను ఊరుకునేది లేదు. ఇల్లు తక్షణం కాళీచేయవలసిందే.'

'ఈ వేళ సాయంత్రం నా చేతిలోకి పది వేలు రూపాయలు వచ్చి పడతాయి. రేపు ఉదయమే తప్పకుండా నీ యిల్లు కాళీచేసి వెళ్ళిపోతాను. ఈ ఒక్కపూటకు ఎట్లాగో భరించు.'

ఇంటి యజమానురాలి ముఖ కవళికలు మారాయి. మాట ధోరణి కూడా మారింది. అతి నింపాదిగా మర్యాదగా 'అట్లాగే. అంతడబ్బు వచ్చే మాటయితే యిల్లుకాళీ చెయ్యనే అక్కరలేదు. కాకపోతే యింట్లో యీ పొగలన్నీ పెడుతున్నందుకుగాను మరి కాస్త అద్దెయెక్కువ యిస్తే చాలు?'

'అలాగే. యిప్పుడు ముప్ఫై యిస్తున్నానుగదా. రేపట్నుంచీ నెలకు యాభై రూపాయలు యిస్తాను, సరేనా?'

యజమానురాలు ముఖం సంతోషంతో నిండి పోయింది. వంగి వంగి నమస్కారం చేసి గదిలోంచి వెళ్ళిపోయింది.

ప్రొఫెసర్ యినుమడించిన ఉత్సాహంతో తన పని కొనసాగించాడు. అనేక పుస్తకాలు తిరగేశాడు. ద్రావకాలు కలిపాడు. నూరాడు. ముద్దలు చేశాడు- కాల్చాడు. మొత్తం చాలా శ్రమ చేశాడు.

ఆ రోజు భోజనం దగ్గర ప్రొఫెసర్ చాలా కులాసాగా వున్నాడు. అందర్నీ నవ్వించాడు. మాటలమధ్య కలల విషయం కదిపి చూశాడు.

టైపిస్ట్ పిల్ల కుసుమ అంది: 'నాకు కలలంటే చాల్లా యిష్టం. అందులో చక్కటి కలలంటే మరీ యిష్టం. పోతే వచ్చిన చిక్కల్లా యేమిటంటే –'

'మీరు చెప్పక్కర్లేదు. నాకు తెలుసు మీ చిక్కు యేమిటో. ఆ చిక్కు తొలగించడానికి నేనో ఆలోచన చేస్తున్నాను లెండి. ఒక్క మాత్ర నోట వేసుకుని పడుకున్నారంటే మీరు నిద్రపోవడంతోటే మధురమయిన స్వప్నాలు పరంపరగా వచ్చి మిమ్మల్ని వినోదంలో ముంచెత్తుతాయి —'

'వేళాకోళం చేస్తున్నారు' అది అమాయకప్పిల్ల.

'లేదు లేదు అక్షరాల నిజం. నిద్రలో వున్న సుఖం యేమిటో జనానికి యిప్పుడే తెలిసి వస్తుంది. అందరూ యిక రోజల్లా పనులుకూడా మానుకొని-కలలు కనాలని కాచుకు కూర్చుంటారు. నా కృషి ఫలితంగా తయారవుతున్న కలల మాత్రలు తింటే ఎటువంటి తీపి కల కావాలంటే అటువంటిదే వస్తుంది'

ప్రొఫెసర్-భోజనం కావడంతోటే తిరిగి తన గదికి చేరుకున్నాడు. ఇందాక తాను తయారుచేసిన ముద్దలో నుంచి చిన్నచిన్న మాత్రల్లు చుట్టి ఒక సీసాలో వేశాడు. ఈ సీసాను చేతి సంచిలో పెట్టుకున్నాడు. ఒక్కసారి అద్దంలో తన స్వరూపం చూచుకొని బట్టతల సవరించుకున్నాడు. పక్కగదిలో వున్న కుసుమను పిలిచి రాత్రికి నేను భోజనానికి రాను అని చెప్పి మెట్లుదిగి రోడ్డుమీదికి వెళ్లిపోయాడు. టాక్సీ చేసుకుని యువకుడి యింటికి దారి చెప్పాడు.

ఇరవై నిమిషాల్లో ప్రొఫెసర్ రామేశం భోళాశంకరం యింటికి చేరుకున్నాడు.

ఇద్దరూ పరిచయంగా నవ్వుకున్నారు.

'అయిపోయింది. శంకరంగారూ! తయారయిపోయింది. నమూనాగా కొన్ని మాత్రలు తెచ్చా. వీటి గుణం చూస్తే మీరు చాలా ఆశ్చర్యపడి పోతారు —'

'నేనేం ఆశ్చర్యపడను. మీరిది తయారు చెయ్యగలరని నేను ముందే ఊహించానుగా. నాకేం విడ్డూరం అనిపించదు. మీ బట్టతలే చెబుతోంది, మీ రిపని సాధించగలరని' అన్నాడు శంకరం.

'మీకు నేనంటే అభిమానం. మరి డబ్బు మాట-'

'యిదిగో' అంటూ భోళాశంకర్ నోట్లకట్ట అందించాడు. ప్రొఫెసర్ సగర్వంగా అందుకని కోటుజేబులో పెట్టుకున్నాడు.

శంకరం యింకా యిలా అన్నాడు: 'యిందాక మీకుచెప్పిన మొత్తం యిది. మనం మాత్రలు విస్తృతంగా తయారుచేసి వ్యాపారం ప్రారంభించేక, లాభాలు పంచుకుందాం. చెరిసగం వాటా మీకు సమ్మతమేనా? నాకేం అత్యాశలేదు. యేమంటారు!'

'అక్షరాలా సమ్మతం. పోతే, నాతో నమూనాగా మాత్రలు పట్టుకు వచ్చాను. మీరు ప్రయత్నించి చూడండి. నేను యిక్కడ కూచుంటాను. మీరు నిద్రనించీ తేరుకున్నాక కలంతా నాకు చెబుదురు గాని—'

'మాత్రలు చూడనివ్వండి—'

ప్రొఫెసర్ తన మాత్రల సీసా అందించాడు.

'వీటివల్ల యెటువంటి ప్రమాదమూ లేదని రూఢేగదా?'

'అణుమాత్రమైన ప్రమాదంలేదు. ఒకవేళ యేదైనా అవలయ కనిపించిందంటే యీసారి తయారుచేసే మాత్రల్లో ఆ దోషం లేకుండా చేస్తాను—'

'అట్లా అయితే, ప్రొఫెసర్, యీ ప్రథమ ప్రయోగం మీరే చేస్తే బాగుంటుందేమో! మీ అనుభవాన్నే నేను వింటాను.'

'లేదు లేదు ప్రథమ ఆనందం మీకే చెందాలి. మీరే దానికి అర్హులు. మీకేం భయం అక్కర్లేదు. యిట్లాంటి మాత్రలు వెయ్యి తిన్నప్పటికీ యేమీ ప్రమాదం లేదు.'

'సరే. ఒక్క మాత్ర రుచి చూస్తాను. ఒక మాత్ర, నీళ్ళగ్లాసు అందివ్వండి' అన్నాడు భోళాశంకరం అయిష్టంగానే.

భోళాశంకరం మాత్ర మింగి, గుక్కెడు నీళ్లు తాగుతూనే 'అప్పుడే నిద్ర వస్తూంది' అన్నాడు.

'మాత్ర ఏం చేస్తుందీ చూశారా మరి!'

'ప్రొఫెసర్ యేదో నెప్పిగా వుంది.'

'భయపడకండి. ముందు అట్లాగే వుంటుంది. ఒక్క నిముషంలో మంచి స్వప్నం వస్తుంది. స్వప్నదేవత తన పురి విప్పి నాట్యం చేస్తోంది.... అంత బిగ్గరగా గుర్రు పెట్టకండి. ఎక్కువగా గుర్రు పెడితే కలలన్నీ కరిగిపోతాయంటారు.'

గుర్రు ఆగిపోయింది.

భోళాశంకరం నిద్రలోనే నవ్వుతున్నాడు. మధురమయిన అనుభూతి పొందుతున్న ఆనందం అతని ముఖంలో తాండవిస్తోంది.

'బ్రహ్మాండం—బ్రహ్మాండం—'

అంటూనే కలలు తెప్పించే మాత్రల సృష్టికర్త వాక్యం పూర్తి చేయకుండానే నిద్రలో మునిగిపోయాడు. ఆయనకు మెలుకువ వచ్చేసరికి, యింకా భోళాశంకరం నిద్రపోతూనే వున్నాడు. ముఖాన చిరునవ్వు చిందుతూనే వుంది. ప్రొఫెసర్‌కు అనుమానం వచ్చి శ్వాస ఆడుతోందో లేదో చూశాడు.

భయంలేదు. అంతా క్రమంగానే వుంది. మెల్లిగా తట్టాడు శంకరాన్ని.

'లే ండి. చాలా సేపయింది నిద్రపట్టి—' అన్నాడు బుజాలు కుదుపుతూ.

భోళాశంకర్ కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుని 'ఎవరు మాటా డేది? ఆ—నేను నెంబరు పదహారునించి మాట్లాడుతున్నాను. రాంగ్ నెంబర్ అంటారా! పోనీండి....' అన్నాడు.

ప్రొఫెసర్ పొడిగ్గా దగ్గాడు.

'మీరు టెలిఫోన్‌లో కాదు మాట్లాడుతున్నది. నాతో మాట్లాడు తున్నారు. మధుర-స్వప్నాలు సృష్టించే మాత్రలు తయారుచేసిన అపర బ్రహ్మను - నాతో మాట్లాడుతున్నారు' అన్నాడు గర్వంగా.

'అవును సుమండీ. మరిచిపోయాను. మాత్ర వేసుకున్నాను కదూ. అబ్బో! చాల గొప్పకల వచ్చింది లెండి, అద్భుతం' అన్నాడు.

'తప్పదు మరి. మాత్ర ప్రభావం అటువంటిది — ఆ, యింతకూ మీ కలఅంతా వివరంగా చెప్పండి.' అన్నాడు ప్రొఫెసర్ అతి నిర్లిప్తంగా. భోళాశంకరం తన కలఅంతా పూసగుచ్చినట్లు అతి వివరంగా చెప్పాడు. ప్రొఫెసర్ తాపీగా విన్నాడు. అంతా అయిం తరువాత 'చాలా బాగుంది! హెలెన్ ఆఫ్ ట్రాయిని కలుసుకొని సుఖంగా కాలం గడపడం చాలా గొప్ప విషయం - మీకు అది సమకూడినందుకు నా అభినందనలు నా ప్రయోగం చక్కగా అమరిందంటారా లేదా?' అన్నాడు.

'చాలా చక్కగా అమరింది. మనం చేయవలసిన పనంతా ముందే వుంది. కోట్లకొద్దీ మాత్రలు తయారుచేసే యంత్రాగారం నిర్మించాలి. మాత్రలు తయారవడంతోటే, పెద్ద బజారులో దుకాణం తీసుకొని ప్రచారం చెయ్యాలి. జనం విరగబడతారు. అబ్బో! మనం కోటీశ్వరులం - కుబేరుల్లాం అయిపోతాం -' అన్నాడు అమిత ఉత్సాహంగా.

యంత్రగారం తయారయ్యింది.

మధుర స్వప్నాలు సృష్టించే మాత్రలు అసంఖ్యాకంగా తయారై చక్కటి అట్ట పెట్టెలలో అమర్చివున్నాయి. అనుకున్న ప్రకారం పెద్దబజార్లో

పెద్ద దుకాణం దొరికింది. ప్రకటనలు, ప్రచారాలు జరిగినాయి. మోటారు కార్లమీద, టాక్సీల మీద, గుఱ్ఱపుబగ్గీల మీద, గోడలమీద, రోడ్లమీద ఎక్కడ చూచినా యీ మాత్రల గురించే ప్రకటనలు. దినపత్రికల్లో మొదటి పేజీ అంతా మధుర స్వప్నాల మాత్రలను గురించే త్రివర్ణ ప్రకటన.

దేశమంతా వీటిని గురించే చర్చలు. త్వరగా వీటిని గురించి తెలుసుకోవాలని తహతహ.

మాత్రలు దేశ వ్యాప్తం అయినాయి. అమ్మకం జోరుగా సాగుతోంది. యంత్రాలకు ఒక్క క్షణం ఖాళీలేదు. ప్రపంచంలో యితర దేశాల నుండే అనేక ఆర్డర్లు వచ్చాయి. భాగస్వాము లిద్దరూ కుబేరుడికే పెట్టుబడి పెట్టగల స్థితికి వచ్చారు.

ఉన్నట్టుండి యీ మహా ప్రవాహానికి అంతరాయం వచ్చింది.

ప్రొఫెసర్ ప్రయోగశాలలో నుంచి దూకుడుగా భోళాశంకరం గదిలోకి వచ్చిపడ్డాడు. 'శంకరంగారూ! కొంప మునిగింది. ఒక్క క్షణంలో నలభైకోట్ల మంది జనం చచ్చిపోతారు. మన కలల మాత్రలు ప్రాణాలు తీస్తాయి. ఆ విషయం నేను యిప్పుడే తెలుసుకున్నాను. భగవాన్! మనం యేంచేసినట్లు? ఈ జనాన్ని రక్షించే విధానం యేమిటి? నలభైకోట్ల మంది; ఈమాత్రల్ని నాశనం చెయ్యాలి. ఇది మృతగుళికలు. అదిగో చూడండి - రోడ్లనిండా జనం - పరుగెత్తుకుంటూ యిటే వస్తున్నారు.... అదిగో, యిక్కడికే వస్తున్నారు——తలుపు తోసుకువస్తున్నారు——'

మొత్తంమీద, తోసుకురావడం జరిగింది. ప్రొఫెసర్ తల బల్లమీద వొరిగి కొట్టుకుంది. ప్రక్కన యేదో అలికిడి.

'లేవండి సార్. యిక్కడ ఖాతాదారులు నిద్రపోయే అవకాశం లేదు' అన్నాడు వెయిటర్——

ప్రొఫెసరు తడుముకుంటూ లేచి నిలబడి 'ఓహో! యేదో కలవచ్చినట్లుంది, అంతే! సరే, ఒకగ్లాసు వేడివేడి పాలు, బిస్కెట్లు తెచ్చిపెట్టు' అన్నాడు.

( ? )